


సమన్వయంతో పనిచేయండి

- లోటుపాట్లు లేకుండా ఇసుకను అందించాలి
- రెవెన్యూ, మైనింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశం
- దిగువమాసపల్లి ఇసుక స్టాక్ యార్డ్‌ను పరిశీలించిన కలెక్టర్, జెసి



ఇసుక సరఫరా విధానంను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రెవెన్యూ, మైనింగ్ శాఖలు సమన్వయంతో పని చేసి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, జెసి విద్యాధరి అధికారులను ఆదేశించారు. చిత్తూరు రూరల్ మండలం దిగువమాసపల్లి వద్దనున్న ఇసుక స్టాక్‌యార్డ్‌ను పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఇసుక సరఫరా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లతో ఈ విధానం అమలుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇసుక బుకింగ్ విధానంలో ఎటువంటి ఇబ్బందులు లేవని నిర్దేశించిన సమయానికి చేరుకొని తీసుకొని వెళ్లడం జరుగుతున్నదని ట్రాక్టర్ డ్రైవర్లు కలెక్టర్‌కు వివరించారు. ఇసుకను ఆన్లైన్లో బుక్ చేసుకున్న ఒకటి లేదా రెండు పని దినాలలో ఇంటి వద్దకే ఇసుకను సరఫరా చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో చిన్నయ్య, మైన్స్ డీడీ ప్రసాద్, సంబంధిత అధికారులు ఉన్నారు.

పరిశుభ్రత పాటించాల్సిందే..

మార్కెట్లో వ్యాపారస్తులకు కమిషనర్ హెచ్చరిక



వ్యాపారస్తులకు సూచనలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పరిసరాల పరిశుభ్రతపై బాధ్యతగా వ్యవహరించాలని కూరగాయలు, చేపల మార్కెట్లో వ్యాపారస్తులకు కమిషనర్ నరసింహ ప్రసాద్ సూచించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం చర్చి వీధిలోని కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణదారులకు శుభ్రతపై హెచ్చరించారు. మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న గోడకు తెల్ల పెయింట్ వేయించారు. చేపలు మార్కెట్లో తనిఖీలు చేస్తూ నిల్వ చేయకుండా ఎప్పటికప్పుడు తాజాగా చేపలను తెప్పించుకోవాలని సూచించారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ శుభ్రంగా ఉంచాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు.

ఎన్నికల హామీలు.. నెరవేర్చరేం..

- కూటమి ప్రభుత్వంపై కాంగ్రెస్ ధ్వజం
- కలెక్టరేట్ ఎదుట స్టీల్ గిన్నెలు మోగిస్తూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఎన్నికల్లో ఆచరణకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి కావస్తున్నా హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ నేతలు ధ్వజమెత్తారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ నాయకులు స్టీల్ గిన్నెలను మోగిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్, నగర అధ్యక్షులు టిక్కీ రాయల్, రాష్ట్ర అధికార ప్రతినిధి శివ శంకర్, రాష్ట్ర నాయకులు రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం శోచనీయం అన్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసేలా తమ పార్టీ తరపున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాయని తెలిపారు.

సామాజిక బాధ్యత పెంపొందించుకోవాలి

విద్యార్థులకు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు సూచన




ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఎంపీ ప్రసాదరావు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు సూచించారు. బుధవారం చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ జ్యోతి అధ్యక్షత ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థులు భవిష్యత్తుకు ఈ కళాశాల ఎంతగానో దోహదపడుతుందని, పీవీకేఎన్ కళాశాలలో వారు ఒక కొత్త అధ్యాయం ప్రారంభిస్తున్నారని అన్నారు. విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, జీవితానికి అవసరమైన పాఠాలను కూడా నేర్చుకోవాలని, కళాశాలలో అందుబాటులో ఉన్న అనేక అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఎంపీ మాట్లాడుతూ విద్య అనేది మన జీవితంలో అత్యంత కీలకమైన అంశమని, యువత సమాజంలో మార్పుకు కర్తవ్యస్థులు కావాలని, విద్యార్థులు కష్టపడి పని చేస్తే అనేక విజయాలను సాధించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా సీపీడీసీ కార్యదర్శి ఎన్.పి. రామ కృష్ణ, అలుమ్ని అసోసియేషన్ సెక్రటరీ చంద్ర శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మీరా సాహెబ్ తదితరులు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు.


పెండింగ్ జీతాలు చెల్లించండి

జెడ్పి సీఈఓకు ఏఐటీయూసీ వినతి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జెడ్పీ సీఈవో రవినాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఆయన కార్మికుల ఇబ్బందులను వివరిస్తూ.. జిల్లా వ్యాప్తంగా గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు 25, 30నెలల జీతం రాకపోయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా తమ ఆరోగ్యాలను క్షీణింప చేసుకుంటూ పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు చెప్పారు. సకాలంలో వేతనాలు అందకపోవడంతో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులెదుర్కొంటున్నారని వివరించారు. వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు నాగరాజు, నాయకులు రమాదేవి పాల్గొన్నారు.



నగరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



వైద్యుల రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

వైద్యం.. అల్లంతదూరంలో..!

- ఆరోగ్య కేంద్రంలో కానరాని వైద్య సేవలు
- వారానికోసారి వచ్చిపోతున్న డాక్టర్
- నిరీక్షించి.. అవస్థలు పడుతున్న రోగులు

ఆపదలో ఆసరాగా నిలవాల్సిన ఆసుపత్రులు దయనీయంగా తయారైయ్యాయి. జలుబో, దగ్గో, జ్వరమో వచ్చినప్పుడు డాక్టరుకు చూపించుకొందామంటే అసలు అందుబాటులో ఉండట్లేదు. అంత మందు బిళ్ల తీసుకొందామంటే అవస్థలు తప్పడం లేదు. వారానికోసారి చుట్టపుచూపునకు వచ్చి వెళుతున్న డాక్టర్ల కోసం నగరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు నిరీక్షిస్తున్నారు. కనీసం ప్రాథమిక చికిత్సం అందించే నాథుడే కరువైయ్యాడని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. - ప్రజాశక్తి-విజయపురం(నగరి)

నగరి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనితీరు రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. వైద్యుల నిర్లక్ష్యం వల్ల సామాన్యులకు వైద్యసేవలు దూరమవుతున్నాయి. వారానికి ఒక రోజు మాత్రమే వైద్యులు వస్తున్నారని, దీంతో నిత్యం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం 11గంటలు కావస్తున్నా డాక్టర్లు కనిపించలేదు. వైద్యం కోసం వచ్చిన రోగులు డాక్టర్ల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పాడింది. నిరీక్షించలేని రోగులు ఆస్పత్రిలో ఉన్న నర్సు ద్వారా తాత్కాలిక వైద్యం చేయించుకుని వెనుదిరిగారు. ఆస్పత్రికి వైద్యం కోసం ప్రతిరోజు 100మందికి పైగా వస్తుంటారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఆ సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ప్రస్తుతం వాతావరణ మార్పుతో వివిధ రకాల జ్వరాలతో ప్రజలు బాధపడుతుంటే డాక్టర్లు కనిపించకపోవడం ఎంత వరకు న్యాయమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఒకే డాక్టర్.. రెండు చోట్ల వైద్యం..

పట్టణ ప్రాథమిక కేంద్రానికి వైద్యాధికారి లేరు. సత్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్‌కు రెండు ప్రాథమిక కేంద్రాల బాధ్యత అప్పగించారు. దీంతో రెండు చోట్ల చూసుకోవాల్సినప్పుడు ఇబ్బంది ఏర్పడుతోందని అధికారుల నుంచి వస్తున్న జవాబు. పట్టణానికి వస్తే సత్రవాడ కేంద్రంలో రోగులు ఎదురు చూడాల్సిన పరిస్థితి. దీంతో అక్కడికి వచ్చే రోగులు గంటల తరబడి నిలబడి వెళ్తున్నారు. ఈ విషయంగా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని రెగ్యులర్ డాక్టర్లను నియమించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేర నియంత్రణలో చురుగ్గా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

- పెండింగ్ కేసులు త్వరితన పూర్తి చేయండి
- ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై కఠినంగా ఉండాలి
- చిత్తూరు తాలూకా పోలీసులకు ఎస్పీ దిశానిర్దేశం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నేర నియంత్రణలో చురుగ్గా ఉంటూ పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించి నిందితులకు శిక్షపడేలా చేయాలని తాలూకా పోలీసులకు ఎస్పీ మణికంఠ చందోలు సూచించారు. బుధవారం తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ఎస్పి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులకు సంబంధించి వివరాలను సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రమేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి ఉన్న ఇబ్బందులను ఆరాదీశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. స్టేషన్లో నమోదైన కేసుల్లో వృత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానము ఉపయోగించి త్వరితగతిన విచారణ పూర్తి చేసి, నిర్దేశిత కాల వ్యవధిలో కోర్టులో ఛార్జ్ షీట్ ఫైల్ చేసి, సమర్థవంతమైన ట్రయిల్ ద్వారా నిందితులకు కఠిన శిక్ష పడేలా చెయ్యాలన్నారు. సివిల్, భూ తగాదాలు, పాత గొడవల్లోని, అనుమానం ఉన్న వ్యక్తులను గుర్తించి బైండోవర్ చెయ్యాలని సూచించారు. స్కూల్స్, హోటల్స్ లాంటి ప్రదేశాలలో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ పాత్ర కీలకం

రాష్ట్ర కార్యదర్శి జివి రమణ



మాట్లాడుతున్న జివి రమణ



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ పాత్ర కీలకమని రాష్ట్ర కార్యదర్శి జివి రమణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిబిఎన్ ఫంక్షన్ హాల్‌లో యుటిఎఫ్ స్వర్ణోత్సవ కార్యక్రమం మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సివి రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై పలు పోరాటాలు ప్రారంభించి ఉపాధ్యా యుల మేలు చేసిన సంఘం జిల్లాలోనే మొదటి మండల శాఖ సమావేశం బంగారుపాళ్యం మండలం లో జరగడం హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుపతి రెడ్డి, జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మణికంఠ, జిల్లా కార్యదర్శి సరిత, కృష్ణమూర్తి, రెడ్డప్ప నాయుడు, పార్థ సారథి, మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వర రా వు, రమేష్ బాబు, మండల గౌరవ అధ్యక్షుల ధనం జయరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు సాంబశివ, జెవివి జిల్లా అధ్యక్షులు బిర్లా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా..

- చెట్లలో ఔషధాలు పడేసిన వైనం



పారబోసిన ఔషధాలు

ప్రజాశక్తి-శాంతిపురం: మండలంలోని రాళ్ళబూదగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆసుపత్రిలో ఉండాల్సి ఔషదాలను రోడ్డు పక్కన చెట్లలో పడేశారు. కొత్తపేట నుంచి కొండతిమ్మనపల్లికి వెళ్లే నడకదారిలో పెద్ద సంఖ్యలో ఔషద బాటిళ్లు కనిపించాయి. నిలిగిరి తోట వద్ద పడేశారు. ఇంకా రెండేళ్ల పాటు ఎక్స్పైరీ డేట్ ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా ఔషదాలను పడేయడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు. ప్రజా ధనంతో కొనగోలు చేసిన ఔషదాలను నిర్లక్ష్యంగా పారబోయడం పట్ల స్థానికులు మండిపడ్డారు. ఈ విషయంగా రాళ్ళబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివకుమారిను చరవాణి ద్వారా వివరణ కోరగా.. "ఇది చిన్నారి దొడ్డి గ్రామ సచివాలయానికి సంబంధించిన ప్రజల వినియోగం కొరకు ఉంచినటువంటి ఔషదాలు" అన్నారు. ఈ విషయంగా సంబంధిత వైద్య సిబ్బందికి మెమోలు ఇస్తానని చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. నిర్లక్ష్యంగా ఎవరు వ్యవహరించిన ఊరుకోమని స్పష్టం చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

పెనుమూరు ఆసుపత్రి తనిఖీలో కలెక్టర్



పెనుమూరు ఆసుపత్రిలో డాక్టర్లతో చర్చిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ డాక్టర్లను ఆదేశించారు. పెనుమూరు సీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో గైనిక్ సేవలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సాధారణ ప్రసవాలు చేసేలా సంబంధిత ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించి అవగాహన పెంచాలన్నారు. మూడు నెలలకు అత్యవసర డ్రగ్స్, ల్యాబ్ రీజన్స్, సానిటరీ ఐటమ్స్ కొనుగోలు చేయాలని ఆదేశించారు. డెంటల్ సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్లు సకాలంలో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు.



కార్వేటినగరం ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతి

ప్రతి పేదవాడికి వైద్యం అందాలి: డీసీహెచ్‌ఎస్

ప్రజాశక్తి-కార్వేటినగరం: వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా సామాజిక సమన్వయ వైద్యాధికారిణి డాక్టర్ ప్రభావతి అన్నారు. బుధవారం సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీహెచ్సీలో అన్ని విభాగాలకు సంబంధించిన వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నా కావాల్సిన సౌకర్యాలు లేకపోవడంతో వైద్య సేవలు కొరవడుతుందని చెప్పారు. ప్రతి పేదవాడికి వైద్య సేవలు అందేలా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగులతో సిబ్బంది స్నేహ పూర్వకంగా మెలుగుతూ వైద్య సేవలు అందించాలన్నారు. విధినిర్వహణలో సమయపాలన తప్పనిసరి పాటించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. డీసీహెచ్‌ఎస్ వెంట డాక్టర్ గోపినాథ్, డాక్టర్ యూసాఫ్ ఖాన్, శృతిభార్గవి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న ఐదు లారీలు సీజ్



సీజ్ చేసిన లారీలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న ఐదు లారీలను సీజ్ చేసినట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమంగా గ్రానైట్ రాళ్లు తరలిస్తున్నట్లు అందిన రహస్య సమాచార మేరకు ఎస్ఐ రాజ్‌కుమార్‌తో కలిసి సురేంద్రనగరం వద్ద వాహనాలు తనిఖీ చేశామన్నారు. ఎలాంటి రికార్డులు లేకుండా ఓవర్ లోడ్డుతో పళ్లిపట్టు మీదుగా చిత్తూరుకు వస్తున్న గ్రానైట్ లారీలను అందుపులోకి తీసుకుని పరిశీలించడం జరిగిందన్నారు. అనంతరం లారీలను సీజ్ చేసి వాటిని జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా మైనింగ్ అధికారులకు లిఖిత పూర్వకంగా అందించి వాహనాలను వారికి అప్పగించడం జరిగిందన్నారు.

కామ్రేడ్ బర్ధన్ ఆశయాలను కొనసాగిస్తాం: సీపీఐ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎబి బర్ధన్ శత జయంతి సందర్భంగా సిపిఐ నాయకులు ఆయన చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. చిత్తూరు ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పోరాటాలను, త్యాగాలను వివరిస్తూ బర్ధన్ ఆశయాలను కొనసాగించాలని సిపిఐ నాయకులు చేత ప్రతిజ్ఞ చేయించారు.



'ప్రజాశక్తి' ఎక్స్‌క్లూజివ్ 2




పక్కా కమర్షియల్

స్విమ్స్‌లో 'పే' చేస్తేనే 'వైద్యం'

ఉచితాలు, రాయితీలకు చెల్లుచీటీ

వైద్యరంగంలో రాయలసీమకే కాకుండా యావత్ నవ్యాంధ్రకే తలమానికంగా నిలుస్తూ, పేదల పాలిట ఆరోగ్యప్రదాయినిగా పేరొందింది శ్రీ వేంకటేశ్వరా వైద్య, విజ్ఞాన సంస్థ(స్విమ్స్). గత మూడు దశాబ్దాల చరిత్రలో మానవసేవే ..మాధవసేవగా భావించి, తరించి ప్రగతిపథంలో పయనించిన స్విమ్స్...నేడు పాలకుల పుణ్యమా అంటూ పక్కా కమర్షియల్‌గా మారిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకప్పుడు డబ్బున్నోడికీ..పేదవాడికీ ఒకేరకమైన వైద్యం అందించి కీర్తిపతాకను అందుకున్న అదే ఆసుపత్రిలో నేడు సామాన్యునికి మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మారిపోతోంది. ఇన్నాళ్లూ సంస్థ ప్రగతికి తార్కాణాలుగా నిలిచిన ఉచిత వైద్యం, క్యాంపులు, మందులు, రాయితీలకు చెల్లుచీటి పాడుతూ.. సామాజిక సేవ నుంచి క్రమేపీ తప్పుకుంటోంది. తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంపూర్ణ ఆర్థిక సహకారంతో పాటు, శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టు, శ్రీబాలాజీ ఆరోగ్య వర ప్రసాదిని, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలతో పరిపుష్టిగా నిధులున్నప్పటికీ పేద రోగుల నుంచి ఫీజులను గుంజడంలో కార్పొరేట్ ఆసుపత్రులకు తామేమీ తక్కువ కాదనట్లు యాజమాన్యం వ్యవహరిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది.



రసూల్ ఓపీపై పేయింగ్‌గా నమోదు

ప్రజాశక్తి- తిరుపతి

పక్క చిత్రంలోని వ్యక్తి నాయబ్ రసూల్..కడప జిల్లా మైదుకూరు వాస్తవ్యుడు. నిరుపేద కుటుంబం. కుటుంబ పోషణకు బయట ప్రాంతాలకు వలసెల్లి అనారోగ్యం బారిన పడ్డాడు. అయితే స్థానికంగా లేకపోవడంతో అతని ఆరోగ్యశ్రీ కార్డును ఏడాది క్రితమే తొలగించారన్న విషయం అతనికి తెలియదు. జీర్ణకోశ సంబంధిత వ్యాధి తీవ్రతరం కావడంతో స్థానికంగా ఉన్న ఆస్పత్రులన్నీ తిరిగి, ఆర్థికంగా చితికిపోయాడు. అయితే వ్యాధి నయం కాకపోవడంతో తెలిసిన వైద్యులు ఒకరు 'నీకు తెల్లరేషన్‌కార్డు ఉంది కదా, తిరుపతిలోని స్విమ్స్‌కు వెళ్లు.. అది టిటిడి పేదల కార్పొరేట్ ఆస్పత్రి.. అతి తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు, అత్యుత్తమ సేవలందిస్తారు. అవసరమైతే ప్రాణదానం పథకం కింద ఉచిత శస్త్ర చికిత్సలు చేస్తారు' అని చెప్పి పంపించారు. దీంతో కొండంత ఆశతో స్విమ్స్‌కు గత శనివారం (సెప్టెంబర్ 21న) వచ్చాడు. ఇక్కడ ఓపి రిజిస్ట్రేషన్ నుంచీ, ఓపీడీ బ్లాక్‌లో వేచిఉండటం, ఫైల్ తీసుకోవడం, డాక్టర్ కన్సల్టేషన్, టెస్టులు చేయించుకోవడం, వాటికి బిల్లులు కట్టడం, తిరిగి రిపోర్టు కోసం ప్రదక్షిణలు చేయడం, ఆ తర్వాత డాక్టర్‌ను కలవడం ఓ ప్రహసనంలా మారింది. తీరా అవన్నీ పూర్తయ్యాక సోమవారం మళ్లీ స్విమ్స్ సిబ్బందిని కలిస్తే 'మీ ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగా ఉంది. వెంటనే అడ్మిట్ కావాలి. బిల్లింగ్ సెక్షన్‌కు వెళ్లి బిల్లు కట్టి అడ్మిట్ కండి. ' అంటూ సమాధానమిచ్చారు. దీంతో నివ్వెరపోయిన ఆయన ' సార్...నా ఆర్థిక పరిస్థితి బాగోలేదు. తెల్లకార్డు ఉండి..ఆరోగ్యశ్రీ కార్డు లేని వాళ్లకు డాక్టర్ సిఫార్సు చేసి సిఎంసిఓ లెటరు ఇస్తే ఉచితంగా వైద్యం చేస్తారట. ఒక వేళ అదీ కుదరని పక్షంలో తెల్లరేషన్‌కార్డు ఉన్నోళ్లకు రాయితీతో వైద్యం, శస్త్రచికిత్స అవసరమైతే 'ప్రాణదానం' ద్వారా చేస్తారని తెలిసి, ఇక్కడకు వచ్చాను. మీరే హెల్ప్‌చేయండి..ప్లీజ్ ' అంటూ ప్రాధేయపడ్డారు. 'ఇప్పుడు అదంతా లేవు. అన్నీ మారిపోయాయి. మిమ్మల్ని పెయిడ్ కేసుగా రాసున్నారు. డబ్బులు కడితేనే ఇక్కడ వైద్యం.'అంటూ నిక్కచ్చిగా చెప్పేశారు. పేదల స్విమ్స్ ఇంత ' కమర్షియల్'గా మారితే మాలాంటి వాళ్ల పరిస్థితి ఏంటీ? అంటూ ఆక్రందన చెందుతూ ఆవేదనతో వెళ్లడం అతని వంతైంది.

సృజనాత్మకతను వెలికితీయడానికే చెకుముకి పరీక్షలు

- జేవివి జిల్లా ప్రధాన కార్యదర్శి షన్ముగం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచి వారిలోని నైపుణ్యాలను తీయడానికి, విజ్ఞానాన్ని పెంచడానికి చెకుముకి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి షన్ముగం అన్నారు. మండలంలో ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలలో దాదాపు 450మంది విద్యార్థులకు బుధవారం జెవివి ఆధ్వర్యంలో చెకుముకి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలలో పాఠశాల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారిని గుర్తించి అక్టోబర్ 1వ తేదీ మండల స్థాయిలో పరీక్ష నిర్వహిస్తామన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని 13 పాఠశాల విద్యార్థులు చెకుముకి టాలెంట్ పరీక్షలకు హజరైయ్యారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఈ పరీక్షలో 1300మంది విద్యార్థాలు పరీక్ష రాశారు. ఎంఈవో-2 సుబ్రమణ్యం పర్యవేక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులకు మండల జెవివి కన్వీనర్ శశికుమార్ అభినందనలు తెలిపారు.


ఎస్ఆర్ పురంలో


బైరెడ్డిపల్లిలో

బంగారుపాళ్యం: చెకుముకి పోటీలు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని విజేత ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ గజేంద్ర ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గజేంద్ర మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి గెలుపొందిన వారిని మండల స్థాయి పోటీలకు పంపనున్నట్టు జనవిజ్ఞాన వేదిక ఉద్దేశం అన్నారు.


బంగారుపాళ్యంలో

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగరాజు జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతిలో వ్యవసాయం చేయాలి

- మండల వ్యవసాయ అధికారి చిట్టిబాబు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అధునాతన పద్ధతిలో వ్యవసాయం చేయాలని మండల వ్యవసాయ అధికారి చిట్టిబాబు అన్నారు. బుధవారం మండలంలోని తుంబకుప్పం, పెరుమాళ్ళపల్లి పంచాయతీలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిణి లీలావతి, సర్పంచ్ లీలావతమ్మ, ఏఈఓ సాధరయ్య, ఐసిఆర్‌పి విజయలక్ష్మి, శేఖర్, రైతు సేవకేంద్రం సిబ్బంది యుగంధర్, హేమంత్, సుమతి పాల్గొన్నారు.

తవణంపల్లి: మండలంలోని ముత్రపల్లి, మైనుగుండ్లపల్లి, నలిసెట్టిపల్లి గ్రామాలలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ రెడ్డి, హెచ్ఓ సాగరిక, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, వెటర్నరీ డాక్టర్ లావణ్యలు రైతులకు అవగాహన కల్పించారు.

గంగవరం: మండలంలోని కూరుని చిన్నూరు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో హాజరైన డిడిఏ మధుసూదన్ రెడ్డి రైతులకు రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న పనిముట్లు, విత్తనాలు, ఎరువులకు సంబంధించిన వివరాలను వివరించారు. సేంద్రియ పద్ధతులలో పంటలు పండించే విధానంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, పశువైద్యాధికారి కల్పన తదితరులు పాల్గొన్నారు.


గంగవరంలో

పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా మాధవయ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర పద్మసాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంజి మాధవయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2013 వ సంవత్సరంలో టిడిపి తరపున రామకృష్ణా పురం సర్పంచ్‌గా రాజకీయ జీవితం ప్రారంభించిన మాధవయ్య, తర్వాత ఏడాది 2014 లో ఎంపిటిసిగా గెలిచి పుత్తూరు మండల ప్రజా పరిషత్ (ఎంపిపి) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా గ్రంథాలయ కమిటీ సభ్యుడిగా పని చేశారు. అనంతరం టిడిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా పదవిలో సేవలం దించారు. పుత్తూరులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం కార్యక్రమం విజయవంతం చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఇటీవల టిడిపి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మాధవయ్య పార్టీకి చేసిన సేవలను గుర్తించి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సిఫార్సు మేరకు ఆయనకు రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవి లభించింది.



క్రైం కార్నర్

నాటు సారా స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-సదుం: రహస్యంగా నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ షేక్ షా వల్లి తెలిపారు. బుధవారం స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. ముందస్తుగా అందిన సమాచారంతో మండలంలోని తాటిగుంటపాళ్యం పరిధిలోని అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించామన్నారు. ఇందిరా నగర్‌కు చెందిన తులసినాయక్(32) నాటుసారా తయారుచేస్తుండగా అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 10లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

బైక్‌పై స్టంట్‌లు వేసిన యువకుడు

- రిమాండ్‌కు పంపిన పోలీసులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ బైక్‌పై స్టంట్‌లు వేస్తూ పలువురిని భయభ్రాంతులకు గురిచేసిన యువకుడిని అదుపులోకి తీసుకున్న వెదురుకుప్పం పోలీసులు కేసు నమోదు రిమాండ్‌కు పంపారు. బుధవారం ఎస్ఐ వెంకట సుబ్బయ్య తెలిపిన కథనం మేరకు.. మండలంలోని మారేపల్లి హరిజనవాడకు చెందిన పవన్‌కుమార్(23) చవటగుంట వద్ద మద్యం మత్తులో వేగంగా బైక్ నడిపి స్టంట్‌లు వేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు యువకుడిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి పుత్తూరు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. జడ్జి అతనికి 15రోజుల పాటు రిమాండ్ విధించారు.

15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి నెల్లూరు జిల్లా రాపూరు అటవీ ప్రాంతంలో 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేసి మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల సూచనలతో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులు ఆధీనంలోని ఆర్ఎస్ఐ ఎం మురళీధర్‌రెడ్డి బృందం మంగళవారం రాత్రి నుంచి రాపూరు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టిందని అధికారులు తెలిపారు. వీరు గోనుపల్లి నుంచి చాటగిరి చెలలు వద్ద చేరుకోగా అక్కడ కొందరు మోటారు సైకిల్‌తో కనిపించారన్నారు. వారిని చుట్టుముట్టడంతో వారిలో కొందరు పారిపోగా ఒకరు పట్టుబడ్డారన్నారు. ఇతనిని గోనుపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించామని తెలిపారు. సమీపంలోనే 15 ఎర్రచందనం దుంగలు వున్న డంప్ కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

కట్నం వేధింపు కేసులో మూడేళ్లు జైలు

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : భార్యను వరకట్నం కోసం వేధించిన కేసులో పుత్తూరు మండలంలోని నెత్తం గ్రామానికి చెందిన రామయ్య కుమారుడు సూరి బాబుకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు నిచ్చారు. సూరిబాబు భార్య దివ్య భారతి(34) ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద పుత్తూరులో కేసు నమోదైంది. ఆమె భర్త సూరిబాబు (42) తనను వరకట్నం కోసం వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. కోర్టుకు వెళ్లిన కేసు విచారణలో జెఎఫ్‌సి ఎం జడ్జి వి గోపాలకృష్ణ నిందితుడికి మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో పాటు ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని పుత్తూరు అర్బన్ ఎస్ఐ కెవి సురేంద్రనాయుడు తెలిపారు.

డ్రైవర్లకు జరిమానా, జైలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 30 మంది నిందితులను 4 వ అడిషనల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తిరుపతిలో హాజరుపరచగా జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున మొత్తం 30 మందికి 3 లక్షల రూపాయలు జరిమానా విధించారు. ఇందులో నలుగురికి మూడు రోజులు జైలు శిక్ష, ద్విచక్రవాహనాలు నడిపిన వారికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



ప్రజాశక్తి-గుడిపల్లి: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని టీడీపీ మండల అధ్యక్షులు బాబునాయుడు అన్నారు. బుధవారం మండలంలోని పోగురుపల్లి పంచాయతీలో పౌష్టికార మాసోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పౌష్టిక ఆహార పదార్థాలను గర్భిణిలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వెంకటేష్ పాల్గొన్నారు.

వృక్షాలకేదీ.. రక్షణ!


చింతచెట్టును నరికి తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: జాతీయ రహదారి పక్కన ఉన్న వృక్షాలకు రక్షణ కరువైంది. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోనే జాతీయ రహదారి పక్కన చింత చెట్లను కొందరు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. కొద్దికొద్దిగా అంటూనే వృక్ష్యాన్ని కత్తరించే పనిలో పడ్డారు. పట్టించుకోవాల్సిన అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడ్డారు. మానవళికి ఉపయోగపడే వృక్ష్యాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఫోర్జరీ సంతకాలపై విచారణ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని గంటావారిపల్లిలో ఫోర్జరీ సంతకాలు చేసి రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ విషయం మండలంలో చర్చనియాంశంగా మారింది. కాగా బుధవారం డిప్యూటీ కలెక్టర్ భవాని స్థానిక తహశీల్దార్ రమేష్ బాబుతో కలిసి ఆ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. బాధితులకు న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

నేడు "డయల్ యువర్ ఎమ్మెల్యే"

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ పరిధిలో గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమం జరుగుతుందని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు మధ్యాహ్నం 12 నుంచి 1గంట మధ్య 9849907885నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. కార్యక్రమానికి చిత్తూరు నగరపాలక అధికారులతో పాటు చిత్తూరు రూరల్, అర్బన్, గుడిపాల మండలాల అధికారులు హాజరుకావాలన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల స్థితికి సంబంధించి నివేదిక సమర్పించాలన్నారు.

విజయవంతంగా ముగిసిన ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసినట్టు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ ఆధ్వర్యంలో బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, శాంతి డెంటల్ క్లినిక్, పిఇఎస్ ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ శిబిరంలో పురపాలక సంఘం సిబ్బందితో పాటు స్థానిక ప్రజలకు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ సుదర్శన్, పిఎస్ ఆసుపత్రి వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్యంపై తగిన సలహాలు సూచనలు అందించడంతో పాటు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్లు సోము, జగన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

క్రీడాకారులకు ఉపాధ్యాయుల అభినందనలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ బాబు, ఉపాధ్యాయుల బృందం అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని నందమూరి తారక రామారావు క్రీడా ప్రాంగణంలో గత రెండు రోజులుగా మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పోటీలలో తమ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. అందులో యోగ అండర్-14 పోటీల్లో తేజశ్రీ, నిఖిత, అండర్-17 పోటీలలో వర్ష, చెస్ పోటీల్లో అండర్-14 యశస్విని, అండర్-17 విద్య శ్రీ, బ్యాడ్మింటన్ అండర్-17 జీవితలు ఉత్తమ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరందరూ త్వరలో తిరుపతి పట్టణం నందు జరగబోవు జిల్లాస్థాయి పోటీలలో పాల్గొనను న్నట్లు వివరించారు. అలాగే క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయులు సునీత, పుష్పలను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో పాటు ఉపాధ్యాయులు, ఎంపిక బృందం

క్రీడల్లో ఆరూరు విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి:- చిట్టమూరు: జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ, అండర్ 14-17 పోటీలకు ఆరూరు హైస్కూలు విద్యార్థులు ఎంపికై క్రీడల్లో తమసత్తా చాటుకున్నారు. ఆరూరు విద్యార్థులు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. కోట మండలం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజక వర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహించారు. ఇటీవల మండల స్థాయిలో ఎంపికలు నిర్వహించామని పిఈటి సురేష్ తెలిపారు. ఈ క్రమంలో బుధవారం కోట బాయ్స్ బాలుర హై స్కూల్లో పోటీలు నిర్వహించగా వాలీబాల్, కబడి, అండర్ 14-17 నుంచి గెలుపొందారని, నిహాల్ సాయి డిస్క్ త్రో, లాంగ్ జంప్ లో గెలిచారన్నారు. విజేతలకు 27 నుంచి 2 తేదీ వరకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మరెన్నో విజయాలు సాధించాలని హెచ్ఎం జ్యోతి ఆకాంక్షించారు.


క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

అంకిత భావంతో సేవలు అందించండి: అదనపు ఈవో

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: శ్రీవారి సేవకులు అత్యంత క్రమశిక్షణ, అంకితభావం, భక్తి శ్రద్ధలతో శ్రీవారి భక్తులకు సేవలు అందించాలని, యాత్రికులకు అందుతున్న వివిధ సేవలపై అభిప్రాయ సేకరణ చేయాలని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి పిలుపు నిచ్చారు. తిరుమలలోని సేవాసదన్- 2లో బుధవారం సాయంత్రం జరిగిన సత్సంగ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన శ్రీవారి సేవకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ శ్రీవారి సేవకులు భక్తుల కు సేవలందించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాము సేవలందించే ప్రాంతాలలో భక్తులకు అందుతున్న సదుపాయాలను గమనించి, వాటిపై అభిప్రా య సేకరణను చేసి తమకు అందించి, తద్వారా వారికి అందుతున్న సౌకర్యాలు మెరుగుపరచడం లో కీలక పాత్ర పోషించాలన్నారు. ఆన్‌లైన్‌లో శ్రీవారి సేవ రిజిస్ట్రేషన్‌తోపాటు, ఎలక్ట్రానిక్ డిప్ సిస్టమ్ ద్వారా ఆలయ విధుల కేటాయింపులు ఎంతో పారదర్శకంగా అందుతాయని తెలిపారు. అనంతరం శ్రీవారి సేవకులకు ఆయనే స్వయం గా ఈ-డిప్ విధానంలో ఆలయ డ్యూటీని విడుదల చేశారు. అంతకుముందు శ్రీవారి సేవకు లు, భజన, ధ్యాన కార్యక్రమాలు జరిగాయి .ఈ కార్యక్రమంలో చీఫ్ పీఆర్వో డాక్టర్ టీ రవి, పీఆర్వో కుమారి పి.నీలిమ, శ్రీవారి సేవ, ప్రజా సంబంధాల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలిస్తున్న టిటిడి అదనపు ఈవో

బీఈడీ కళాశాలలో ముందస్తు దసరా సంబరాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బీఈడీ కళాశాలలో ముందస్తు దసరా ఉత్సవ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి జానకిరామయ్య పాల్గొని మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, దసరాను పది రోజులు నిర్వహిస్తారన్నారు. 10వ రోజున పౌర్ణమి కనిపించడంతో జరుపుకుంటారన్నారు. వర్సిటీలోని విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు, సుఖ సంతోషాలతో దసరా మహోత్సవాలని జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఈడీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

'చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కల్తీ నెయ్యి ఘటనలో చట్ట ప్రకారం చర్యలు తీసు కోవాలని ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద స్వామి పేర్కొన్నారు. బుధవారం ఆయన తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాం లో హిందూ దేవాలయపై దాడులు, విగ్రహాలు, రథాల ధ్వంసం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాధు పరిషత్ ఆధ్వర్యంలో తిరుమల ఖ్యాతికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో రెడ్డి శేఖర్ రాయల్, గణేష్ స్వామి, మాతాజీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు సుస్థిర భవిష్యత్తుకు పునాది..

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రకృతి వ్యవసాయ పద్ధతులు సుస్థిర భవిష్యత్తుకు పునాది అని ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ నీరజ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగం, బయో సైన్స్ అండ్ సెరికల్చర్, న్యాయ విభాగాలు సంయుక్తంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మహిళలకు మూడు రోజుల పాటు ఉచిత శిక్షణ అందించారు. తిరుపతి రూరల్ మండలంలోని వేమూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఈ శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ నీరజ మాట్లాడుతూ మహిళలకు సేంద్రియ వ్యవసాయ పద్ధతు లపై అవగాహన కల్పించి ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంచి, తద్వారా పర్యావరణ సుస్థిరతను, మహిళా సాధికారతను సాధించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా వర్సిటీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ నీరజ

పరిసరాల శుభ్రతతోనే రోగాలు దూరం


పారిశుద్ధ్య కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, తదితరులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండలంలోని ఆలత్తూరు, టిటి కండిగా, ఈడిగ పల్లె, కొత్తూరు గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను మాజీ ఎంపీపీ జనార్ధన్ రాజు, పంచాయతీ కార్యదర్శులు, టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రైతు కార్యదర్శి జనార్ధన్ రాజు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, మాజీ సర్పంచ్ పరందాం, సర్పంచ్ పుష్పాంజలి, స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ ఎకంబరం, నాయకులు ప్రకాష్, దయానిది, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని కొక్కుపాడు పంచాయతీలో మండల వ్యవసాయ అధికారి వి. నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు భూసార పరీక్షలుపై అవగాహన కల్పించి సాగు చేస్తున్న పంటలను ఈ పంట నందు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. నిరంజన్ కుమార్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వి.రెడ్డి నాయక్, ఏపీ సీఎమ్ఎఫ్, విఏఏ,ఏ హెచ్ఏ,విఎఫ్ఏ లు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి తోడ్పడతాం

- ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్

ప్రజాశక్తి-తవణంపల్లి: అభివృద్ధి ఒకవైపు, మరోవైపు సంక్షేమం సమపాళ్ళలో అమలు చేస్తూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీడివో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మండల అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందుకే అందర్నీ కలుపుకొని ముందుకు వెళ్తున్నానని, రానున్న రోజుల్లో నగరంలోని ప్రతి ఇంటికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటానని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రజాపాలనను పురస్కరించుకొని బుధవారం బిఎస్ కణ్ణన్ ప్రభుత్వ కళాశాల మైదానంలో "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు.

సదుం: "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమాన్ని టీడీపీ నాయుకులు బుధవారం సదుం మేజర్ పంచాయతీలోని నడిగడ్డ గ్రామంలో చేపట్టారు. ఇంటింటికి కర పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యర్రగుంట్ల శ్రీనివాసులు రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, భవన్ కుమార్, అరవపల్లి వెంకట రత్నం, దామోదర్ రెడ్డి, పవన్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రామకుప్పం: కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అమలవుతుందని, దీంతో ఆర్థిక అభివృద్ధి మెరుగుపడుతుందని టీడీపి కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్ భాషా, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, రాష్ట్ర నేత మునస్వామి పేర్కొన్నారు. బుధవారం రామకుప్పం, చిక్కుపల్లి తాండ, సింగ సముద్రం, 89 పెద్దూరు పంచాయతీల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆంజనేయ రెడ్డి, నరసింహులు, సర్పంచ్ మురళి, సీతాపతి, చలపతి, చిన్న కృష్ణ, రామ్మూర్తి, రాజసింహ, సుబ్రీ, హరీష్, జయశంకర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని చప్పిడిపల్లి పంచాయతీలో బుధవారం టిడిపి పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు చంద్రశేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సురేష్ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా నెల్లిపట్ల గ్రామంలో ఎంఈవో-2 సుబ్రమణ్యం అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ సాంబయ్య, చిన్న బుడ్డమ్మ, నాయకులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఇది ప్రజల ప్రభుత్వమని వాణిజ్య విభాగం అధ్యక్షులు వంశీ చౌదరి అన్నారు. బుధవారం మండలంలోని గుంతూరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన వంద రోజులలో ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకుని వెళ్లడం రానున్న రోజుల్లో ఇంకా చాలా మంచి పథకాలను అమల్లోకి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకుని వస్తుందన్నారు. కార్యక్రమంలో సామయ్య, కేశవులు నాయుడు, గోపాల్ నాయుడు, బాబు, సంపూర్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లి పంచాయతీలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు హాజరైయ్యారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సభలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు తమ వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ మురళి, దేవరాజుల నాయుడు, బిఎం రవి, మొగిలయ్య, మనోహర్ నాయుడు, కోదండ యాదవ్ పాల్గొన్నారు.



